క్లుప్తంగా

ప్రభుత్వ భూములను రక్షించండి

దుమ్ముగూడెం: మండలంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను రక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు కురుసం రవి డిమాండ్ చేశారు. మండలంలోని నడికుడి గ్రామంలోని సర్వే నంబర్ 81 ప్రభుత్వ భూమిని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ భూమి అక్రమణకు గురవుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భూములను దారా దత్తంగా గిరిజన నేతరులకి కట్టబెడుతున్న రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ భూములు అక్రమణకు గురవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొర్సా గంగరాజు, కాకా రాంబాబు, అపక వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేటలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ నాయకులు బుధవారం నిర్వహించారు. పార్టీ బలపరచిన అభ్యర్థి సరోత్తమ్ రెడ్డికి, మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. తమ అభ్యర్థిని గెలిపిస్తే, ఉపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికి బీజేపీ కృషి చేస్తుందని అన్నారు. ప్రచార కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉడతనేని విశ్వేశ్వరరావు, కోలికపోగు ముసలయ్యతోపాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న క్లబ్ బాధ్యులు

మణుగూరుటౌన్: మహాశివ రాత్రిని పురస్కరించుకుని పాత మణుగూరులోని నీలకంఠేశ్వరాలయం వద్ద భక్తులకు మణుగూరు వాసవీ క్లబ్, వాసవీ వనితా వైభవం సంయుక్త ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మిట్టపల్లి శ్యామ్, బొగ్గవరపు అంజలిలు మాట్లాడుతూ.. ప్రతి యేటా మహాశివ రాత్రి సందర్భంగా ప్రాచీన ఆలయం వద్ద భక్తులకు వాసవీక్లబ్ ఉచిత మజ్జిగ పంపిణీ చేయడం ఆనవాయితీ అన్నారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 4వేల మందికి పైగా దర్శనం చేసుకున్న భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం తలపెట్టిన వాసవీ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ దోసపాటి స్వర్ణ, ఐపీసీ బండారు నర్సింహారావు, జిల్లా జాయింట్ సెక్రటరీ చిట్టూరి శేషుబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు చిత్తలూరి ఉమ, వాసవీక్లబ్ ట్రెజరర్ కంకటాల సాయి, కేసా రాజేంద్రప్రసాద్, సంకా శ్రీనివాసరావు, దోసపాటి ధర్మారావు, రాధాశ్యాం గుప్తా, చిత్తలూరి రమేశ్, సుగ్గల సూర్యం, భాను తదితరులు ఉన్నారు.

శంభో.. శంకర


అశ్వారావుపేటరూరల్: దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు..

ఘనంగా మహాశివరాత్రి పర్వదిన వేడుకలు

- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- పూజలు, అభిషేకాలతో కార్యక్రమాలు

మహాశివరాత్రి పర్వదిన వేడుకలను బుధవారం శివాలయాల్లో ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజామునే నిద్రలేచి గోదావరి, కోనేరులు, ఇళ్ల వద్ద అభ్యంగన స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకున్నారు. పరమేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయాలకు చేరుకున్న భక్తుల శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: గోదావరిలో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు


చర్ల: గంగా స్నానం అనంతరం స్వామి వారిని పల్లకీలో తోడ్కొని వస్తున్న భక్తులు


మణుగూరురూరల్: శివపార్వతుల విగ్రహాలను తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు


అన్నపురెడ్డిపల్లి: హరిహరక్షేత్రంలో కిటకిటలాడిన భక్తజనం


అశ్వాపురం: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పాయం పూజలు..


దుమ్ముగూడెం: నర్సాపురం చిన్న అరుణాచల ఆలయంలో భక్తుల కోలాహలం


చంద్రుగొండ: కనకగిరి గుట్టలపై వీరభద్రుడి సన్నిధిలో భక్తులు


చర్ల: పెదమిడిసిలేరులో కల్యాణం అనంతరం శోభాయాత్రలో గిరిజన నృత్యాలు..


అన్నపురెడ్డిపల్లి: ఉత్సవ విగ్రహాల పూజలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు


బూర్గంపాడు: మోతెగడ్డకు గోదావరిలో కాలినడకన వెళ్తున్న భక్తులు


ఉమాపృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం


ములకలపల్లి: ఆలయంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుకు సత్కారం..


పినపాక: చింతల బయ్యారం శివాలయంలో దర్శనం కోసం బారులు..


కరకగూడెం: శివలింగం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


మణుగూరురూరల్: పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు


అన్నపురెడ్డిపల్లి: భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం


మణుగూరురూరల్: గోదావరి వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీఐ సతీష్‌కుమార్


బూర్గంపాడు: మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయంలో దర్శనానికి పోటెత్తిన భక్తులు


మణుగూరురూరల్: ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు

ఆశ్రమాన్ని సందర్శించిన ఎంపీ

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో ఉన్న శ్రీరంగనాథస్వామి ఆశ్రమం, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామ సహాయం రఘురాం రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, టీఎస్ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబుతో కలసి సందర్శించారు. బుధవారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, మల్లేశ్వరస్వామి ఆలయంలో శివయ్యకు నిర్వహించిన అర్చన, అభిషేకం తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రంగనాథస్వామి ఆశ్రమంలో ఇటీవలే నూతనంగా నిర్మించిన షిర్డీ సాయినాథుడి ఆలయంలో దత్తాత్రేయ, సాయిబాబాలను దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ స్వామిజీ, ఆశ్రమ బాధ్యులు కూకలకుంట శ్రీదేవి, శివాలయ కమిటీ చైర్మన్ రావు గంగాధరరావు, చందా సుబ్బారావు, కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పర్వతనేని ప్రసాద్, సాయిల నర్సీ తదితరులు పాల్గొన్నారు.


రంగనాథస్వామి ఆశ్రమంలో దత్తాత్రేయుడిని దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

కరుణగిరి మహోత్సవాల్లో పాల్గొనాలి

గుండాల: ఆర్‌సీఎం ఉమ్మడి ఖమ్మం జిల్లా పీఠం బిషప్ సగిలి ప్రకాష్, హైదరాబాద్ ప్రధాన చర్చి ఆర్చి బిషప్ పూల అంతోని ఆదేశాల మేరకు.. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 2 వరకు జరిగే కరుణగిరి పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవాలకు గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని స్థానిక పునీత పాల్, పేతురు దేవాలయ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కూరపాటి యాకోబు కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తొలత జగద్గురువులు ఫ్రాన్సిస్ పోప్ ఆరోగ్య రీత్యా ప్రతిరోజు క్రైస్తవ భక్తులు ప్రార్థనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 27 నుంచి 4 రోజులపాటు ఖమ్మం కరుణగిరి కేదడ్రల్ చర్చిలో జరిగే పుణ్యక్షేత్ర జాతర మహోత్సవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని క్రైస్తవులు, వివిధ గ్రామాల నుంచి పాల్గొంటున్నారని, విశ్వాసులకు ప్రతిరోజు ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు, భక్తరస కళానృత్యాలు, కోలాటాలు, పలు రకాలతో కూడిన కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతిథులకు భక్తులకు భోజన సౌకర్యంతో పాటు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మహోత్సవాలకు విశ్రాంత బిషప్ పాల్ మైపన్ పాల్, ఖమ్మం కరుణగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్లు, రెవరెండ్ ఫాదర్లు మాత్యూ వర ప్రసాదరాజు, అంతోని రాజులతోపాటు పలువురు పెద్దలు, ఉపదేశకులు పాల్గొననున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

అశ్వారావుపేటరూరల్: నేడు జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. బుధవారం వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో సిబ్బంది చేరారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 6 పోలింగ్ కేంద్రాలు, 3 రూట్‌లను ఏర్పాటు చేశారు. మండలాల వారిగా కేంద్రాలు, ఓటర్ల వివరాలు పరిశీలిస్తే.. అశ్వారావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రం పరిధిలో 47 మంది ఓటర్లు, దమ్మపేట జెడ్పీహెచ్ఎస్ పరిధిలో 76 మంది ఓటర్లు, ములకలపల్లిలో జూనియర్ కళాశాల కేంద్రం పరిధిలో 26 మంది, అన్నపురెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్ కేంద్రంలో 20 మంది, చంద్రుగొండ జెడ్పీహెచ్ఎస్ కేంద్రం 17 మంది చొప్పున మొత్తం 186 మంది ఓటర్లు కాగా, వీరిలో పురుషులు 107, మహిళలు 79 మంది ఉన్నారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సాగుతుంది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అంతా సిద్ధం చేశామని, అర్హత ఉన్న ఓటర్లు తమ ఓటు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్ కోరారు. ఆయన స్థానిక పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, కేంద్రానికి వచ్చిన పోలింగ్ సిబ్బంది, పీఓ, ఏపీఓలకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాన్ని స్థానిక సీఐ కరుణాకర్ తనిఖీ చేసి, పోలింగ్ సామాగ్రిను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..ఒకొక్క పోలింగ్ కేంద్రానికి ఒక ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేలా అన్నీ చర్యలు చేపట్టామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.


అశ్వారావుపేటరూరల్: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది


గుండాల: పోలింగ్ అధికారులతో పోలీస్ సిబ్బంది

గుండాల: నేడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా స్థానిక గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ఇమ్మానుయేల్ తెలిపారు. మండలంలో మొత్తం 13 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఆళ్లపల్లి మండలంలోని 15 మంది ఓటర్లకు గాను అక్కడి జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రానికి చేరిన సామగ్రి

దుమ్ముగూడెం: నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండగా దుమ్ముగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి బుధవారం ఎన్నికల సామగ్రితో సిబ్బంది చేరుకున్నారు. పోలీస్ అధికారుల భద్రత నడుమ ఎన్నికల సిబ్బంది సామగ్రిని పోలింగ్ కేంద్రానికి తరలించారు. వారి వెంట తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆర్ఐలు కల్లూరి వెంకటేశ్వరరావు, నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రం సందర్శన

అశ్వాపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 79వ పోలింగ్ కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ స్వర్ణలత, ఎస్సై తిరుపతిరావు సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు.


దుమ్ముగూడెం: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది


అశ్వాపురం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ స్వర్ణలత, ఎస్సై తిరుపతిరావు


అశ్వారావుపేటరూరల్: పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన సీఐ కరుణాకర్, పోలీస్ సిబ్బంది

రాయన్‌పేటకు రహదారేది?

- ఏళ్లు గడుస్తున్నా తాగునీరు, ఇతర వసతులు దూరం
- విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో ఆదివాసీలు

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో మారుమూల వలస ఆదివాసీ గ్రామమైన రాయన్‌పేట గ్రామానికి కనీస రహదారి సౌకర్యం లేకుండా పోయింది. రహదారితోపాటు విద్యుత్, విద్య, వైద్యం వంటి కనీస మౌలిక సౌకర్యాలు లేక గిరిజన ఆదివాసీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొట్ట చేతపట్టుకొని ఇతర రాష్ట్రాల నుంచి దశాబ్దాల క్రితం వలస వచ్చిన ఆదివాసీలకు ఈ దుస్థితి ఎదురవుతోంది.
మణుగూరు రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 25 కుటుంబాల వలస ఆదివాసీలు 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. ఎన్నో ఏండ్లుగా కనీస రహదారి సౌకర్యం లేదు. గ్రామంలో ఎవరికైనా రోగం వచ్చినా, గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చిన వారిని ఆస్పత్రికి తరలించాలంటే డోలి కట్టి తీసుకువెళ్లాల్సిందే. ప్రభుత్వాలు పాలకులు మారుతున్నా గిరిజన ఆదివాసీల బతుకులు మాత్రం మారడం లేదు. గిరిజన గ్రామాలు, గిరిజనుల అభివృద్ధికే ఐటీడీఏ ఉన్నా మారుమూల గిరిజన ఆదివాసీ గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

విద్యుత్ ఉండదు..

వలస ఆదివాసీలు ఇక్కడ 20 ఏళ్లుగా స్థిర నివాసాలు ఏర్పరుచుకున్నప్పటికీ నేటి వరకూ వారికి విద్యుత్ సౌకర్యం లేదు. రాత్రి సమయాల్లో పాములు, తేళ్ల వంటి విష కీటకాలు, రోగాల బారిన పడుతున్నామని ఆదివాసీలు వాపోతున్నారు. గిరిజన ఆదివాసీలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు, ఓటు హక్కు, గుర్తింపు ఉన్నా కనీస సౌకర్యాలు మాత్రం అందడం లేదు. దీనికితోడు గ్రామంలో ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేక పూరి గుడిసెలో నిర్వహిస్తుండటంతో గిరిజన, ఆదివాసీ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సౌకర్యమూ పూర్తి స్థాయిలో లేదు. సోలార్ మోటర్ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాసీలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న మణుగూరు రైల్వేస్టేషన్ నుంచి రాయన్‌పేట వెళ్లే రహదారి

రోడ్డు నిర్మించాలి..



మణుగూరు రైల్వేస్టేషన్ నుంచి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలి. దీంతో గాల బారిన పడితే ఆస్పత్రులకు వెళ్లలేక ఇబ్బందిపడుతున్నాం. ప్రభుత్వం, అధికారులు స్పందించి మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– శంకర్, గ్రామస్తుడు

విద్యుత్ సౌకర్యం కల్పించాలి..



మా గ్రామం ఏర్పడి 20 సంవత్సరాలు అయినా కరెంటు సౌకర్యం లేదు. చుట్టూ అడవి ఉంటడంతో రాత్రి సమయాల్లో చీకట్లో పాములు, తేళ్లు, విష జంతువులతో ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామానికి కరెంటు సౌకర్యం కల్పించాలి.

– ఆనంద్, గ్రామస్తుడు